క్లుప్తంగా

మాల మహానాడు అధ్యక్షుడిగా భాస్కర్

చిట్యాల: పట్టణానికి చెందిన గోలి భాస్కర్ మాల మహానాడు చిట్యాల మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బెల్టు షాపులను నిర్మూలించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చండూరు : బెల్టు షాపులను నిర్మూలించాలని కోరుతూ బంగారిగడ్డ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, మాజీ ఎంపీటీసీ పల్లె వెంకన్న, మాజీ సర్పంచ్‌లు భూతరాజు ఆంజనేయులు, సాపిడి రాములు, బొమ్మరబోయిన సైదులు, ఇరిగి రాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు బోయపల్లి చెన్నయ్య, బోయపల్లి రాములు, సుంకరి నరసింహ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మర్రిగూడ : మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కంఠ మహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు సోమవారం విరాళం అందించారు. యరగండ్లపల్లి గ్రామానికి చెందిన రాందాసు శ్రీనివాస్ రూ.10వేలు, పులిమామిడి నరసింహారెడ్డి, ఏడుదొడ్ల కృష్ణారెడ్డి రూ.55వేల విరాళాన్ని గౌడ కులసంఘం నాయకులకు అందజేశారు.

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి అందజేస్తున్న లింగంగౌడ్

మర్రిగూడ : మండలంలోని మేటిచందాపురం పరిధి ఇందుర్తి గ్రామంలో యువకులకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగం గౌడ్ సోమవారం క్రికెట్, వాలీబాల్ కిట్‌ల తోపాటు ఇతర క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో అశోక్‌గౌడ్, గణేశ్, రఘు, హుస్సేన్, యాసిన్, శివ పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టు గేట్లు మూసివేత

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు తగ్గుముఖం పట్టడంతో సోమవారం ప్రాజెక్టు అధికారులు దిగువకు నీటి విడుదల పూర్తిగా నిలిపివేశారు. హైదరాబాద్ నగరంతోపాటు, మూసీ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మూసీ ప్రాజెక్టుకు సోమవారం కేవలం 994 క్యూసెక్కుల వరదనీరు వచ్చింది. 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టం గల మూసీ ప్రాజెక్టులో సాయంత్రం వరకు నీటిమట్టం 644.50 అడుగులు ఉంది. ఆయకట్టులో పంటల సాగుకు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 415 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.31 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

పైళ్ల నర్సిరెడ్డికి నివాళి

చిట్యాల: వెలిమినేడు గ్రామానికి చెందిన పాల ఉత్పత్తిదారుల సంఘం సభ్యుడు పైళ్ల నర్సిరెడ్డి ఇటీవల మృతి చెందాడు. సోమవారం నర్సిరెడ్డి చిత్రపటానికి నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అర్రూరి శ్రీశైలం పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా అందజేత

ఉత్పత్తిదారుల సంఘం సభ్యుడు నర్సిరెడ్డి కుటుంబ సభ్యులకు మదర్ డెయిరీ ద్వారా మంజూరైన రూ.పది వేల రూపాయల ఎక్స్‌గ్రేషియాను సోమవారం ఆ గ్రామ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం అధ్యక్షుడు మారగోని యాదయ్య అందజేశారు. కార్యక్రమంలో సంఘం పాలకవర్గ సభ్యులు ఏనుగు మల్లారెడ్డి, మేడగోని అంజయ్య, గడ్డం సూర్యప్రకాష్‌రెడ్డి, ఏర్పుల నర్సింహ, దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వల్ల భాయ్ పటేల్, ఏనుగు చంద్రకళ, నక్క కళమ్మ, వేతన కార్యదర్శి మేడగోని సత్తయ్య, సంఘం నాణ్యత పరిశీలకుడు బొంతల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న విద్యుత్ కష్టాలు

- సింగారం గ్రామంలో ఇన్నాళ్లూ తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు
- సమస్య పరిష్కారానికి రూ.10 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- ఆ నిధులతో మరమ్మతు పనులు చేయిస్తున్న అధికారులు



సింగారం గ్రామంలో విద్యుత్ స్తంభాలు నాటుతున్న సిబ్బంది

మునుగోడు: ఎంతోకాలంగా మునుగోడు మండలంలోని సింగారం గ్రామ ప్రజలు విద్యుత్ సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇళ్ల పైనుంచి వేలాడుతున్న విద్యుత్ తీగలు.. పలు వీధుల్లో వంగిన స్తంభాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే ఇటీవల ఆ గ్రామ సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి తమ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆ గ్రామ ప్రజలు మొరపెట్టుకున్నారు. దీంతో ఆయన గ్రామంలో కలియదిరిగి స్వయంగా పరిశీలించారు. విద్యుత్ అధికారులను వెంటనే పిలిపించుకుని గ్రామంలో విద్యుత్ సమస్య ఉండవద్దని, శిథిలమైన స్తంభాలను తొలగించడంతోపాటు లూజ్‌లైన్లకు మరమ్మతులు, అదనపు లైన్ల ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అవసరమైతే అదనంగా నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి నియోజకవర్గంలోనే విద్యుత్ సమస్యలేని గ్రామంగా తీర్చిద్దిది మోడల్ విలేజ్‌గా సింగారం గ్రామాన్ని సిద్ధం చేయాలని సూచించారు. అందుకు అవసరమైన నిధులు తన కోటా నుంచి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

రూ.10 లక్షల వ్యయంతో మరమ్మతులు..

సింగారం గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.10 లక్షలను రాజగోపాల్‌రెడ్డి వెంటనే మంజూరు చేశారు. దీంతో గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు ఆఘమేగాల మీద పనులు చేపడుతున్నారు. ప్రధానంగా పలు వీధుల్లో వంగిన స్తంభాలతోపాటు వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా చేసే స్తంభాలు మొత్తం 70 కిపైగా పూర్తిగా తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా కాలనీల్లో ఇళ్ల పైనుంచి విద్యుత్ వైర్లు లేకుండా వీధి మధ్యలో నుంచి విద్యుత్ వైర్లు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వాటికి త్వరలో నూతన వైర్లను లాగి గ్రామంలో విద్యుత్ సమస్య లేకుండా చేయాలని అధికారులు తీవ్ర కృషి చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు సమస్యను వివరించాం



సింగారం గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు పదేళ్లుగా అనేకమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఇటీవల మా గ్రామాన్ని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సందర్శించినప్పుడు విద్యుత్ సమస్యలను వివరించాం. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మా గ్రామంలోని విద్యుత్ సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే తీసుకున్న నిర్ణయం ఎప్పటికీ మరవలేనిది.

–పోగుల ప్రకాష్, మాజీ సర్పంచ్, సింగారం

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నాం

ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సింగారం గ్రామంలోని విద్యుత్ సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తున్నాం. అందుకు అవసరమైన రూ.10 లక్షల నిధులు ఎమ్మెల్యే వెంటనే మంజూరు చేశారు. ఆ నిధులతో శిథిలమైన స్తంభాలను తొలగించడంతోపాటు నూతనంగా మొత్తం 70 విద్యుత్ స్తంభాలు నాటించాం. అతి త్వరలో నూతన వైర్లు బిగిస్తాం. అవసరమైతే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్య లేని గ్రామంగా తీర్చిదిద్దుతాం.

– సురేష్, మండల విద్యుత్ అధికారి

వేగవంతంగా బీజేపీ సభ్యత్వ నమోదు

- బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ వీరేందర్‌గౌడ్



చిట్యాల : సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీరేందర్‌గౌడ్

నకిరేకల్ : బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతంగా నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జ్ తూళ్ల వీరేందర్ గౌడ్ తెలిపారు. నకిరేకల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు లక్ష సభ్యత్వ నమోదులు దాటాయన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు 50 వేలపైనే దాటిపోవచ్చన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై గడిచిన ఎనిమిది నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేక పెరిగిందన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని, రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ నకిరేకంటి మొగిలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, మండల అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి, జానయ్య, చెనగాని సైదులు, మైల శ్రీనివాస్, రవి శంకర్, నవీన్, నారగోని వెంకటేశ్వర్లు, ఉపేంద్రచారి, బోనగిరి వెంకన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. చిట్యాలలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదులో చిట్యాలను మొదటి స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీను, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మాస శ్రీనివాస్, పార్టీ ప్రధాన కార్యదర్శి గంజి గోవర్ధన్, బూత్ అధ్యక్షుడు నూకేష్, ఉదయ్, జయారపు రామకృష్ణ, కందాటి చంద్రారెడ్డి మండలంలోని బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అని వర్గాల సంక్షేమం సాధ్యం

నల్లగొండ టూటౌన్ : బీజేపీతోనే ప్రజల సంక్షేమం సాధ్యమని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహేష్, వెంకన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవ చండీ యాగం

రామగిరి (నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌లో సోమవారం దైవం వినోద్‌శర్మ, అన్నపూర్ణ నివాసంలో నవ చండీయాగం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కొండూరు నారాయణమూర్తి, కొండపాటి సుబ్రహ్మణ్య శర్మ, రామాంజనేయులు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



చండూరు : నగదు అందజేస్తున్న స్నేహితులు

చిట్యాల: మున్సిపాలిటీలోని ఏడో వార్డుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు చిత్రగంటి ప్రభాకర్(35) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి ..లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని మున్సిపల్ చైర్మన్ చినవెంకట్‌రెడ్డి ద్వారా ప్రభాకర్ కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ప్రభాకర్ మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు పాల శివ, దేశపాక రాజేష్, జిట్ట భిక్షం తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

చండూరు : పట్టణ కేంద్రానికి చెందిన చెరుపల్లి రాజు (48) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని రాజు బాల్య స్నేహితులు సోమవారం పరామర్శించి రూ.31,500 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సచ్చిదానంద, ఎస్. లింగారెడ్డి, గిరిధర్, పృథ్వీధర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని తుడిమిడి గ్రామానికి చెందిన బండారు సత్యనారాయణ ఇటీవల ఆంధ్ర, ఒడిషా సరిహద్దులో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. అతడితోపాటు 2001–02 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదువుకున్న సహచరులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పొన్నాల కోటేశ్వర్, గిరగాని సురేశ్, చొగోని జానయ్య, అశోక్, జిట్టబోయిన పరశురాములు, బండపల్లి జానయ్య, వంగూరి రవి, కంబాల వీరభద్రయ్య, బండి నర్సింహస్వామి, ఈదుల సైదులు, పవన్, శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత శోభాయాత్ర



నకిరేకల్ : దుర్గామాత శోభాయాత్రలో పాల్గొన్న పట్టణ ప్రజలు



మర్రిగూడలో అమ్మవారి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

నకిరేకల్ : పట్టణంలోని కనకదుర్గ ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి సోమవారం రాత్రి నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నేత దైద రవీందర్ శోభాయాత్రను ప్రారంభించారు. పట్టణ వీధులగుండా సాగిన ఈ శోభాయాత్రలో మహిళలు కోలాట ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ బ్రహ్మాదేవర పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారి శోభాయాత్రను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అర్థం దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రఘు, రాములు, దామోదర్, శ్రీనివాస్, గోపి, కిషన్, శేఖర్, సత్యనారాయణ, వేణు, వెంకటేశ్వర్లు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : మండలంలోని పస్నూర్ గ్రామంలో సోమవారం దుర్గామాత ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. సైదారెడ్డి, వెంకట్‌రెడ్డి, అభిస్‌బాబా, హరీష్, మహేష్, వీరమళ్ల శేఖర్, దండిగా సాలయ్య, ధనంజయ్య ఉన్నారు.

కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్‌లు



నల్లగొండ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు



ప్లాట్‌ఫాంపై గుంపులుగా ప్రయాణికులు



టికెట్ కౌంటర్ వద్ద..

నల్లగొండ రూరల్ : దసరా పండుగ ముగియడంతో ప్రయాణికులు తిరిగి వారి గమ్యస్థానాలకు చేరుతున్నారు. దీంతో సోమవారం ఉమ్మడి జిల్లాలోని అన్ని బస్టాండ్‌లు ప్రయాణికులతో కిక్కిరిశాయి. ఉమ్మడి జిల్లా నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. రద్దీని బట్టి బస్సుల సంఖ్య పెంచుతామని ఆర్టీసీ అధికారులు గతంలోనే ప్రకటించారు. రద్దీ మేరకు ఆర్టీసీ బస్‌లను నడుపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు ఎగబడ్డారు. బస్సుల్లో నిలబడేందుకు సైతం చోటు దక్కలేదు. కొన్ని చోట్ల బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. మధ్యాహ్నం నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రయాణికుల రద్దీతో బస్టాండ్‌లన్నీ కిక్కిరిసిపోయాయి. బస్టాండ్‌లలో ఎక్కువగా మహిళా ప్రయాణికులే కనిపించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నకిరేకల్ : చీమలగడ్డలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన నకిరేకల్, తుంగతుర్తి ఎమ్మెల్యేలు వీరేశం, సామేల్

నకిరేకల్ : రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని చీమలగడ్డలో, తాటికల్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు పర్యవేక్షణ చేస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ జమురుద్దీన్, ఎంపీడీఓ చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి జానిమియా, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలి

చిట్యాల: ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల, వెలిమినేడు గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ జయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్లు సుంకరి మల్లేష్‌గౌడ్, ఏనుగు రఘుమారెడ్డి, వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, పీఏసీఎస్ సీఈఓలు బ్రహ్మాచారి, బొంతల రాజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు పిశాటి భీష్మారెడ్డి, నర్రా మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని రాంనగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్ రావు, మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, పీఏసీఎస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.నాగేశ్వర్‌రావు, మానిటరింగ్ అధికారి డి సుమానందం, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎండీ జలీల్ అహ్మద్, సీఈఓ మల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

శాలిగౌరారం: రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. 'సాక్షి' దినపత్రికలో సోమవారం 'కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేదెప్పుడు'అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులతో పాటూ స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ స్పందించారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటూ మండలంలోని గురుజాల గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ×ఏ×గ్రేడ్ ధాన్యంకు రూ.2320, ×బీ×గ్రేడు ధాన్యంకు రూ.2300 మద్దతు ధర లభిస్తుందన్నారు. సింగిల్ విండో చైర్మన్ తాళ్ళూరి మురళి, డైరెక్టర్ నోముల రవి, తహసీల్దార్ యాదగిరి, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చీనానాయక్, ఏపీఎం జానకి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ మండలంలోని కొత్తపల్లిలో ఏపీఎం వినోద, ఏఓ శ్రీనివాస్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కుదావన్‌పూర్, నర్సింగ్‌బట్ల, తొరగల్, మేళ్లదుప్పలపల్లి, పెద్దసూరారం, చిన్న సూరారం, ఖాజీరామారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఏపీఓ స్ఫూర్తి, సీసీలు గీత, నర్సింహ, అంజయ్య, శారద, ఎస్ఆర్‌పీ నాగలక్ష్మి, జయలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.



చండూరు : గుండ్రపల్లి గ్రామంలో..

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్, కొత్తపేట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభిస్తున్నామని ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

చండూరు : మండల పరిధిలోని గుండ్రపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎంపీడీఓ రాంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీటీ నిర్మలాదేవి, ఏపీఎం పుల్లయ్య, ఏఈఓ శోభారాణి, గిర్దావర్ మురళీ కృష్ణ, ధాన్యం కేంద్రం ఇన్‌చార్జ్ జాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని లచ్చుగూడెం, చెట్లచెన్నారం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కనగల్ తహసీల్దార్ బి. పద్మ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, సీఈఓ రామచంద్రారెడ్డి, శంకర్, యాదగిరి పాల్గొన్నారు.

నాంపల్లి : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవసింగ్, పూల వెంకటయ్య, మాల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఆర్ అంజాచారి, పూల యాదగిరి, చంద్రారెడ్డి, కత్తి రవీందర్‌రెడ్డి, రాజు, వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి నామమాత్రంగా అధికారుల హాజరు



అధికారులందరూ రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

మునుగోడు: గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు విన్నవించేందుకు ప్రతి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి అన్నిశాఖల అధికారులు హాజరు కావడం లేదు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఎంపీడీఓ పూజ, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, ఏఓ పద్మజ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ మనిదీప్, ఏపీఓ శ్రీనయ్యలు మాత్రమే హాజరయ్యారు. విద్య, విద్యుత్, ఐసీడీఎస్, ఎక్సైజ్, అటవీశాఖ, పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు హాజరు కాలేదు. కనీసం ఆ శాఖలకు చెందిన కిందిస్థాయి సిబ్బంది కూడా హాజరుకాలేదు. దీంతో ఆయా శాఖల అధికారుల తీరుపై పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి

సంస్థాన్ నారాయణపురం: సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. సోమవారం చిమిర్యాల గ్రామంలో నిర్వహించిన సీపీఎం 12వ గ్రామ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీల ఎంపికలో రాజకీయ జోక్యం వద్దని సూచించారు. రాజకీయ పార్టీలతో సంబంధాలు లేకుండా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. గ్రామశాఖ నూతన కార్యదర్శిగా సుర్వి కిరణ్, మహిళా కార్యదర్శిగా మల్లెపెల్లి లలితలను ఎన్నుకున్నారు.

అంశల సత్యనారాయణ మృతికి సంతాపం

మర్రిగూడ : ఫ్లోరైడ్ విముక్తి పోరాట యోధుడు అంశల స్వామి తండ్రి అంశల సత్యనారాయణ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని సోమవారం జల సాధన సమితి వ్యవస్థాపకుడు దుశ్చర్ల సత్యనారాయణ సందర్శించి నివాళులర్పించారు. అదేవిధంగా శివన్నగూడ శ్రీ నీలకంఠ రామస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రాపోలు యాదగిరి గ్రామానికి చెందిన ఊరిపక్క మహేందర్ ద్వారా సత్యనారాయణ కుటుంబసభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో దోటి సైదులు, కొత్తపల్లి నరసింహ, కిరణ్, పాండరయ్య, బొడ్డుపల్లి సత్తయ్య, జంపాల ప్రశాంత్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



అంశల సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దుశ్చర్ల సత్యనారాయణ